క్లుప్తంగా

బాలల పరిరక్షణ కమిటీల ఏర్పాటు



చిన్నారులతో మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ బాక లవకుశ

అనంతగిరి: మండలంలోని కొత్తూరు పంచాయతీ తుమ్మనవలస గ్రామంలోని బాలల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలోని బాలల సంఘాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా నవ్యశ్రీ, కో–కన్వీనర్ డేవిడ్, సభ్యులు త్రివేణి, అన్వేష్‌కుమార్, ప్రమీల, రిబ్కాను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కన్వీనర్ బాక లవకుశ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సర్పంచ్ అధ్యక్షతన 6 నుంచి పదేళ్ల వయస్సుగల చిన్నారులకు సంఘం, 11 నుంచి 18 వయస్సుగల వారికి ఓ సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. పిల్లల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు, ఈ సంఘాలు ఉపయోగపడతాయని చెప్పారు.

అమ్మవారి జాతరకు పూజా సామగ్రి



గంగాలమ్మ జాతర నిర్వహణకు సామగ్రిని అందిస్తున్న తణుకు విజయలక్ష్మి

అడ్డతీగల: మండలంలోని ఐదు గ్రామాల భక్తులకు గంగాలమ్మ వారి పుట్టింటి చీర, సారె, పూజా సామగ్రిని మంగళవారం అందజేసినట్టు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య తెలిపారు. ఈ మేరకు మండలంలోని తిరుమలవాడ, దాకోడు, ఎరడాల బంద, బందమామిళ్ల, ఎం.భీమవరం గ్రామాల నుంచి గిరిజనులు తమ గ్రామాల్లో గంగాలమ్మ జాతరకు సంబంధించి సహకరించాలని కోరగా, వారికి ఆయా వస్తువులను అందించినట్టు ఆయన చెప్పారు. ఆయా సామగ్రితో పాటు పూజారులకు నూతన వస్త్రాల వితరణ చేశామన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్ఐ నరేంద్రప్రసాద్

రాజవొమ్మంగి: గిరిజన యువత క్రీడల్లో రాణించాలని, శరీరధారుఢ్యాన్ని పెంపొందించుకోవాలని రాజవొమ్మంగి ఎస్ఐ గోపీ నరేంద్ర ప్రసాద్ కోరారు. శరభవరం పంచాయతీ వణకరాయి గ్రామంలోని యువతకు వాలీబాల్ కిట్‌లను ఆయన మంగళవారం అందజేశారు. క్రీడల్లో అనుసరించాల్సిన మెలకువలను వివరించారు. దేశ సేవలో యువకులు ముందుండాలని, పోలీస్ తదితర రిక్రూట్‌మెంట్లకు అవసరమైన విద్యార్హతతో పాటు ఫిట్‌నెస్‌ను సాధించాలని సూచించారు.

గిరి గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ముంచంగిపుట్టు: మండలంలోని మారుమూల లక్ష్మీపురం పంచాయతీ జఖడ, బిరిగూడ, ఉబ్బెంగుల గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్ మంగళవారం పర్యటించారు. గ్రామాల్లో సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. సబ్సిడీలు, పంటల బీమా, వడ్డీ లేని రుణాలు, సంక్షేమ పథకాలు, సచివాలయం వ్యవస్థ పనితీరు తదితర విషయాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌బీకే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం

అరకులోయ రూరల్: మండల కేంద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన విద్యార్థులు మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు ఆన్‌లైన్ చేసుకునే వారు సంబంధిత ధ్రువపత్రాలతో కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

జగన్ పాలన దేశానికే ఆదర్శం



చినబరడలో గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్లు అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి



గాయిబంధలో గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

చింతపల్లిరూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని పెదబరడ పంచాయతీలోని చినబరడ, పెదబరడ, రాజుపాకలు, సిరిపురం, మడిగుంట, తెరపల్లి , రబ్బరుగొంది గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని 287 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి యోగ క్షేమాలు, సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లోనూ జగనన్నకే తమ మద్దతు ఉంటుందని గ్రామస్తులు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు మరోసారి జగన్‌కు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. చింతపల్లిలో వంద పడకల ఆసుపత్రిని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ అనూషాదేవి, మండల పార్టీ అధ్యక్షుడు రవి, సర్పంచ్ గోపాల్, ఎంపీటీసీ లోవరాజు, కో–ఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.



బుంగాపుట్టులో పర్యటిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్

ప్రజల చెంతకే సంక్షేమ పథకాలు

అరకులోయ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే పథకాలు అందుతున్నాయని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలో బస్కి పంచాయతీ గాయిబంధ, మొర్రిగూడ, పూసేలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లోని 197 గృహాలను ఎమ్మెల్యే పాల్గుణ సందర్శించారు. సంక్షేమ పథకాల అమలుతీరు, గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ శివారు గ్రామాల అభివృద్ధి జగనన్నతోనే సాధ్యపడుతోందన్నారు. అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. ఎంపీపీ ఉషారాణి, సర్పంచ్ పాడి రమేష్, వైస్ ఎంపీపీ రామన్న, పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, మాజీ అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు, మండల కన్వీనర్ సంపత్‌కుమార్, వైస్ సర్పంచ్ రాంచందర్, నాయకులు బాబూరావు, నాగేశ్వరరావు, సాంబ పాల్గొన్నారు.

సంక్షేమ వారధి జగనన్న

ముంచంగిపుట్టు: మండలంలోని బుంగాపుట్టు పంచాయతీ కేంద్రంతో పాటు కొజిరిగూడ గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి, జగనన్న స్టిక్కర్లు అతికించారు. ప్రతి పల్లెను అభివృద్ధి పథంలో నడిపిస్తూ సంక్షేమ వారధిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. సర్పంచ్ నోబిన, నేతలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

28 నుంచి సోమాలమ్మ జాతర ఉత్సవాలు



సోమాలమ్మ అమ్మవారు

అడ్డతీగల: మండలవాసుల ఇలవేల్పుగా కొలుచుకునే సోమాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈనెల 28 నుంచి జూన్ 1 వరకూ ఐదు రోజులపాటు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం కమిటీ ప్రతినిధులు ,గ్రామస్తులతో కలిసి జాతర నిర్వహణపై సమావేశమయ్యారు. గతంలో రెండు రోజులపాటు జాతర నిర్వహిస్తుండగా భక్తుల కోరిక మేరకు ఈ దఫా ఐదు రోజులపాటు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. తొలిరోజు అమ్మవారిని తోడ్కొని రావడం, ఊయల రాటలు వేయడం, గరగల నృత్యాలు, భజనలు భారీ ఎత్తున నిర్వహిస్తామన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, మొక్కులు తీర్చుకోవడం వంటివి ఉంటాయన్నారు. జాతర నిర్వహణలో ఉద్యోగ, ఉపాధ్యాయ, వ్యాపారులతో పాటు అన్ని వర్గాల వారిని భాగస్వాములను చేస్తున్నామన్నారు.

ముగిసిన అమ్మవార్ల ఉత్సవాలు



పట్టాలమ్మ అమ్మవారు



బిరిమిశాలలో ఘటాల ఊరేగింపులో గిరిజనులు

రాజవొమ్మంగి: మండలంలోని వట్టిగెడ్డ గ్రామ దేవత పట్టాలమ్మ జాతర మహోత్సవాలు మంగళవారం తెల్లవారుజామునతో వైభవంగా ముగిశాయి. దాదాపు వందేళ్లుగా గ్రామస్తులు ఈ అమ్మవారి జాతర ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు. చంటిపిల్లలకు ఎటువంటి అంటు వ్యాధులు సోకకుండా కాపాడాలని, ప్రకృతి విపత్తుల నుంచి గ్రామాన్ని రక్షించాలని, పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉంచాలని కోరుకొంటు అమ్మవారికి నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమలు, పూలు దీపధూప నైవేద్యాలతో పూజలు చేశారు. డప్పువాయిద్యాలు, బాణాసంచా వెలిగిస్తు గ్రామంలో మహిళలు అమ్మవారిని ఊరేగిస్తు మొక్కులు చెల్లించుకొన్నారు. జాగారాల్లో భాగంగా సోమవారం రాత్రి ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన కాంతారా ఫేం నృత్యాలు ఆకట్టుకున్నాయి.

సాక్షి, పాడేరు: పాడేరు మండలం బిరిమిశాలలోని జాంకారమ్మ తల్లి ఉత్సవాలు, బందపాలంలో మోదకొండమ్మ తల్లి వేడుకలు మంగళశారం ఘనంగా ముగిశాయి. ఆయా గ్రామాల్లో అమ్మవార్ల ఘటాలను భారీగా ఊరేగించి, భక్తులు మొక్కులు సమర్పించుకున్నారు.

గృహ నిర్మాణ పనులపై సూచనలు



సచివాలయ సిబ్బందితో సమావేశమైన ఎంపీడీవో బాపన్నదొర

రాజవొమ్మంగి : చెరకుంపాలెం, జడ్డంగి సచివాలయాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందితో ఎంపీడీఓ బాపన్నదొర మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన శాశ్వత గృహ నిర్మాణాలకు సంభందించి లబ్ధిదారులు పనులు ప్రారంభించేలా చూడాలని సూచనలిచ్చారు. ప్రభుత్వ యంత్రాంగం సూచించిన సర్వేలను సచివాలయ సిబ్బంది సకాలంలో పూర్తి చేసి నివేదిక ఇవ్వాలన్నారు. సర్పంచ్‌లు దాసరి నాగేశ్వరరావు, కొంగర మురళీకృష్ణ, సొసైటీ చైర్మన్ శింగిరెడ్డి రామకృష్ణ, వలంటీర్లు, ఇంజనీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన సంబరాలు



దుంబ్రిగుడలో చిత్రలేఖనంలో విద్యార్థులు

చింతపల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి విజ్ఞాన సంబరాలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు ఆట, పాటలతో పాటు, పుస్తక పఠనం చేసేలా ప్రభుత్వం విజ్ఞాన సంబరాలు నిర్వహిస్తోందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి సూర్యనారాయణ కోరారు.

దుంబ్రిగుడ: మండలం కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన సంబరాల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం కార్యక్రమం నిర్వహించినట్టు గ్రంథాలయాధికారి సునీత చెప్పారు.

చలో కలెక్టరేట్ రేపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నాయకులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని మంగళవారం జరిగిన కార్యక్రమంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమం పోస్టర్‌ను సంఘం నాయకుడు రామన్న ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నిర్మించనున్న హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలని, బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దన్నారు. గిరిజనులు తరలివచ్చి చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు బుజ్జిబాబు, జోగుల్, ప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



విజేతగా నిలిచిన మోహనపురం టీమ్‌కు బహుమతి అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం

గంగవరం: గంగవరం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. పోటీల్లో విజేతగా మోహనపురం టీమ్ నిలిచింది. జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం, టీమ్ సభ్యులను అభినందించి, బహుమతులు అందజేశారు.

రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ గంగరాజు, ఎంపీటీసీ సభ్యుడు చిట్టిబాబు

జి.మాడుగుల: మండలంలో సింగర్ల పంచాయతీలోని పార్లు గ్రామంలో శ్మశానవాటికకు మట్టి రోడ్డు పనులను సర్పంచ్ గంగరాజు, ఎంపీటీసీ సభ్యుడు పి.చిట్టిబాబు మంగళవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కోరాపల్లికి వెళ్లేరోడ్డు మార్గం నుంచి పార్లు గ్రామం సమీపంలో గల శ్మశానవాటికకు మట్టి రోడ్డు కోసం ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరైనట్టు తెలిపారు. సచివాలయం కన్వీనర్ సూర్యప్రకాష్‌నాయుడు, గృహసారథులు రామకృష్ణ, మత్స్యలింగం, మాజీ సర్పంచ్ చిన్నాచారి, టీఏ హేమలత పాల్గొన్నారు.

రుణయాప్‌లతో అప్రమత్తం

కొయ్యూరు: రుణ యాప్‌లతో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రాజారావు చెప్పారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో యాప్‌ల ద్వారా రుణాలు తీసుకున్న లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అవగాహన లేక మోసాల బారిన పడుతున్నారని చెప్పారు. రుణ యాప్‌ల మాయలో పడొద్దన్నారు. జంక్ కాల్స్‌తో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.

11, 12 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుంబ్రిగూడ: మండలంలో విద్యుత్ ఉప కేంద్రం మరమ్మతు పనుల కారణంగా ఈనెల 11, 12న రెండు రోజులు పాటు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. వినియోగదారులు సహకారించాలని విద్యుత్ శాఖ కార్యనిర్వహణ అధికారి ఎవిఎస్ఎం అప్పారావు మంగ్లవారం ఒక్క ప్రకటనలో తెలిపారు.

అంగన్‌వాడీల్లో ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

అరకులోయ రూరల్: మండలంలో మాదల పంచాయతీ తుంగగెడ్డ అంగన్‌వాడీలో హెల్పర్, ఇరగాయి పంచాయతీలో గాతపాడు మినీ అంగన్‌వాడీలో కార్యకర్త పోస్టులు ఖాళీగా ఉన్నట్టు సీడీపీవో శారద మంగళవారం తెలిపారు. ఆయా గ్రామాల్లో అర్హులైన మహిళలు ఆయా పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు, మరింత సమచారం కోసం ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

ముంచంగిపుట్టు: మండలంలోని రంగబయలు,పెదగూడ పంచాయతీల్లో చంపాపుట్టు, బకుబేడా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో ఎం.వరహాలమ్మ సూచించారు. అర్హులైన అభ్యర్థులు ఆయా పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలి సీడీపీవో ఎం.వరహాలమ్మ అన్నారు. ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు నోటిఫికేషన్ జారీ అయిందని, 21 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉన్న అభ్యర్థులు ఈ నెల 10 నుంచి 17వ తేదీ లోగా ఐసీడీఎస్ కార్యలయంలో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. దరఖాస్తుతో పాటు కులం, నివాసము, తదితర ధ్రువపత్రాల జెరాక్స్‌లకు గెజిటడ్ అధికారిచే అటెస్టేషన్ చేయించి అందించాలని, పూర్తి వివరాలకు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

నిర్ణీత గడువులోగా రీసర్వే పూర్తి

జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ ఆదేశం



రంపచోడవరం: జిల్లాలోని భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా నిర్ణీత గడువులో రీసర్వే పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సర్వే అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోలతో భూహక్కు భూరక్ష పథకం రీసర్వేపై ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సర్వే ప్రారంభించిన రోజు నుంచి వంద రోజుల్లోగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటివరకు వంద గ్రామాల్లో రీసర్వే పూర్తయిందన్నారు.సర్వే చేసిన గ్రామాలకు సంబంధించి రైతుల పేర్లు తప్పులు లేకుండా ఎప్పటికప్పుడు అప్లోడ్ చేసే బాధ్యత సంబంధిత తహసీల్దార్లపై ఉందన్నారు. రికార్డుల ప్రకారం రైతుల పేర్లు తప్పులు లేకుండా నమోదు చేయడమే కాకుండా ఉమ్మడి భూములు ఉంటే మ్యుటేషన్ చేయాలని సూచించారు. సర్వే చేసే ముందు రైతులకు నోటీసులు ఇవ్వాలన్నారు. సర్వేపై అభ్యంతరాలు ఏవైనా ఉంటే మళ్లీ సర్వే చేయవచ్చన్నారు. ఏజెన్సీలోని గిరి రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా సర్వే చేసే బాధ్యత మనపై ఉందన్నారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె. దేవేంద్రుడు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రాజశేఖర్, తహసీల్దార్లు తాతారావు, శ్రీనివాసరావు, శ్రీమన్నారాయణ, సీహెచ్ శ్రీనివాసరావు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

‘జగనన్నకు చెబుదాం’తో సమస్యల పరిష్కారం



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని టీవీలో వీక్షిస్తున్న ప్రజాప్రతినిధులు



జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని గిరిజనులకు వివరిస్తున్న సర్పంచ్ సవిరెల చంద్రుడు

అడ్డతీగల: మండలంలోని గ్రామ సచివాలయాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభోత్సవంలో ప్రజలను భాగస్వాములను చేసినట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర చెప్పారు. సమస్యల పరిష్కారానికి అమల్లోనికి తీసుకొచ్చిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మంగళవారం వర్చువల్ విధానంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారన్నారు. ప్రజలూ ఎదుర్కొంటున్న సమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కారం కాని పక్షంలో ఈ కార్యక్రమం ద్వారా నేరుగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ల వచ్చని ఎంపీడీఓ బాపన్నదొర చెప్పారు.

ఎటపాక: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని గుండాల ఎంపీటీసీ సభ్యుడు గొంగడి వెంకట్రామిరెడ్డి చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వ్యక్తిగత స్థాయిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి జగనన్నకు చెబుదాం ఉపయోగపడుతుందన్నారు. సర్పంచ్‌లు సీతాలక్ష్మి, ఆదినారాయణ,స చివాలయ సిబ్బంది ఉన్నారు.

రాజవొమ్మంగి: సీఎం. వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా, విన్నూత్నంగా ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం అంటూ మండలంలోని గడుఓకుర్తి సర్పంచ్ సవిరెల చంద్రుడు పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం దోనెలపాలెంలో ప్రజలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాల వివరాలను టీవీలో చూపిస్తు వివరించారు. ఇకపై ఏ సమస్య ఉన్న ప్రజలే నేరుగా ప్రభుత్వానికి ఫోన్ చేసి చెప్పవచ్చని, ఇటువంటి కార్యక్రమం గతంలో ఎవ్వరూ ప్రవేశపెట్టలేదన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



జడ్డంగి పీహెచ్‌సీలో గర్భిణులను పరీక్షిస్తున్న డాక్టర్



వై.రామవరం సీహెచ్‌సీలో గర్భిణులకు స్కానింగ్ చేస్తున్న వైద్యాధికారులు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పీహెచ్‌సీలో మంగళవారం ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 118 మంది గర్భిణులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. వారికి అవసరమైన మందులను వైద్యాధికారిణి సుజీ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైరిస్క్‌లో ఉన్న గర్భిణిని గుర్తించి వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఉంచామన్నారు. వైద్యాధికారి యామినిప్రియ పాల్గొన్నారు.

వై.రామవరం: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పీఎంఎస్ఎమ్ కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.గౌతమి ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగ్, రక్తపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. శిబిరంలో సుమారు 117 మందికి వైద్య పరీక్షలు చేశారు. శిబిరానికి వచ్చిన గర్భిణులు, సహాయకులకు భోజన, వసతి, రవాణా సౌకర్యాలు కల్పించారు. వైద్యాధికారిలు. సిబ్బంది పాల్గొన్నారు. చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో వైద్యాధికారులు నరేంద్ర, దినేష్‌ల ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

శిక్షణ నైపుణ్యంతోనే స్వయం ఉపాధి



ధ్రువపత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి

అరకులోయ రూరల్: శిక్షణ నైపుణ్యంతోనే యువతకు మరింత స్వయం ఉపాధి కలుగుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి చెప్పారు. మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయం వద్ద బెంగుళూరుకు చెందిన ఎఫ్‌వీటీఆర్ఎస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జెడ్పీటీసీ సభ్యురాలు రోషిణి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో నిరుద్యోగ యువత వలసలు వెళ్లకుండా స్వయం ఉపాధిపై శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గ్రామాల్లో ఇటువంటి శిక్షణ కార్యక్రమాలకు తమ వంతుగా సహకరిస్తామన్నారు. ఎఫ్‌విఆర్ఎస్ సంస్థ సేవలను కొనియాడారు. మరిన్ని శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సంస్థ ప్రతినిధులను కోరారు. ఈ సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో మూడు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలను అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు దురియా ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్‌కుమార్, మహిళా సంఘం నాయకురాలు జయ, ఎఫ్‌వీటీఆర్ఎస్ సంస్థ కో–ఆర్డినేటర్ బుద్ధురాజు, ట్రైనర్లు మహలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యం



ఉపాధ్యాయులకు స్టీల్ గ్లాసులను అందజేస్తున్న విద్యాశాఖ సిబ్బంది

జి.మాడుగుల: మండల పరధిలోని 186 పాఠశాలల ఉపాధ్యాయులకు స్టీల్‌గ్లాసులను మంగళవారం జీవీకే–4 బృంద సభ్యులు, ఎంపీడీవో చంద్రశేఖర్ , సెకెండ్ ఎంఈవో, ఏపీఎం సుందరమ్మ తదితరులు అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రభుత్వం గోరుముద్ద పథకం కింద పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ తాగేందుకు స్టీల్ గ్లాస్‌లు అందిస్తోందన్నారు. ఉపాధ్యాయులు రామ్మూర్తినాయుడు, రత్నం, మోహన్‌రావులకు స్టీల్ గ్లాస్‌లను అందజేశారు. ఎంఐసీ వెంకటరమణ, సీఆర్పీలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.